క్లుప్తంగా

ఎన్టీపీసీ కాలుష్యంతో కాలనీలో ఉండలేకపోతున్నాం



మాట్లాడుతున్న కార్పొరేటర్ జ్యోతి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ మాతంగికాలనీ, ఖాజీపల్లి గ్రామలకు తెలంగాణ ఎన్టీపీసీ పవర్ ప్లాంట్ ఆనుకొని ఉండడంతో పవర్ ప్లాంట్ నుంచి వెలువడే దుమ్ము, ధూళి, శబ్దాలతో ప్రభావిత కాలనీలు పూర్తిగా కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. సోమవారం మాతంగికాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 39వ డివిజన్ కార్పొరేటర్ జెట్టి జ్యోతి మాట్లాడారు. ఎన్టీపీసీ, తెలంగాణ పవర్ ప్లాంట్ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో 39వ డివిజన్‌లో కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

జూలపల్లి: మండల కేంద్రంలోని కుర్మపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి తనిఖీ చేశారు. పిల్లలు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న పాలు, గుడ్లు, పౌష్టికాహారం వివరాలు, రికార్డులను పరిశీలించారు.

నేటి నుంచి క్రీడాపోటీలు ప్రారంభం

ముత్తారం: మండలస్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఈనెల 10 నుంచి 12 వరకు జరుగుతాయని ఎంపీడీవో సురేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు వీడియో కాన్ఫరెన్స్

సుల్తానాబాద్: జిల్లాలోని రైతు వేదికల్లో మంగళవారం ఉదయం 10 గంటలకు రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా యాసంగి సాగులో కూరగాయల సాగు విధానం, సూచనలు, సలహాల కోసం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడికి షోకాజ్ నోటీస్

కమాన్‌పూర్: పేంచికలపేట కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇరుగురాల శేఖర్‌కు మండల అధ్యక్షుడు వైనాల రాజు సోమవారం షోకాజ్ నోటీస్ అందజేశారు. మండల ప్రధాన కార్యదర్శి చొప్పరి శేఖర్‌పై చేయి చేసుకున్నందుకు కాంగ్రెస్ ఆదేశాలతో వివరణ కోరుతూ షోకాజ్ నోటీస్ ఇచ్చామన్నారు.

ఆర్.కృష్ణయ్యను కలిసిన బీసీ సంఘ నేతలు



సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: బీజేపీ రాజ్యసభ సభ్యుడిగా ఆర్.కృష్ణయ్యను ఎంపిక చేయడంతో బీసీ సంఘ నేతలు కలిసి అభినందించారు. సోమవారం హైదరాబాద్ బీసీ భవన్‌లో కృష్ణయ్యను కలిసి రాజ్యసభ టికెట్(బీజేపీ) వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మనోజ్‌గౌడ్, రాష్ట్ర నాయకులు, యువజన సంఘం నాయకులున్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందించిన పూర్వ విద్యార్థులు

ఓదెల: కొలనూర్ గ్రామంలోని హైస్కూల్‌కు చెందిన 108 మంది విద్యార్థులకు పూర్వ విద్యార్థులు స్పోర్ట్స్ డ్రెస్సులను సోమవారం పంపిణీ చేశారు. గత సంవత్సరం పదోతరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.3వేలు, 2వేలు, వెయ్యి చొప్పున నగదును ప్రోత్సాహకం కింద పంపిణీ చేశారు. ఎంఈవో రమేశ్, ప్రధానోపాధ్యాయులు జేసుదాసు, పూర్వ విద్యార్థుల ప్రతినిధి పూసాల చంద్రమోహన్, మాజీ ఎంపీటీసీ కారెంగల శ్రీనివాస్, పీఈటీ విష్ణు పాల్గొన్నారు.

వీహెచ్‌ఆర్ చేయూత



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న వీహెచ్‌ఆర్ సభ్యులు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బండారి సంతోష్ ఇటీవల మరణించగా.. తన ఇద్దరు కూతుళ్లు తండ్రిని కోల్పోయి అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాల్ల హరీశ్‌రెడ్డి తన తల్లిదండ్రులైన మాజీ ఎంపీపీ అనసూయ-రాంరెడ్డి చేతుల మీదుగా సోమవారం బాధితుడి నివాసంలో ఇద్దరు ఆడపిల్లలకు రూ.50వేలను అందజేశారు.

అభివృద్ధికి నోచుకోని ఆలయం



రామగుండం: అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.30కోట్ల నిధులతో గతేడాది నుంచి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. రామగుండం రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశించగానే కుడివైపున శ్రీసీతారాముల ఆలయం కనీసం ధూప దీప నైవేద్యాలకు సైతం రైల్వేశాఖ సమకూర్చలేని దుస్థితికి చేరడం దురదృష్టకరమంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ప్రాంగణం పూర్తిగా చెత్త, చెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోయి, రంగులు వెలిసిపోయి కళావిహీనంగా మారింది.

ఎత్తిపోతలకు విద్యుత్ సబ్ స్టేషన్ సిద్ధం



రామగుండం: 9 రోజుల్లోనే 33/11 సామర్థ్యం గల నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసి పదోరోజు గ్రిడ్‌కు అనుసంధానించిన రికార్డు రాష్ట్రంలోనే టీజీఎన్‌పీడీసీఎల్ సంస్థ ఇంజినీర్లకే దక్కిందని అంతర్గాం ఏఈ ఆశ శంకర్ అన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్ ఆరంభం నాటికి ఎత్తిపోతల ద్వారా సాగునీటిని అందించాలనే ప్రభుత్వ నిర్ణయంతో యుద్ధప్రాతిపదికన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది. అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి ఎత్తిపోతల పథకానికి 1500 కిలోవాట్స్ సామర్థ్యంతో నడిచే మూడు భారీ మోటారు పంపులకు ప్రత్యేకంగా అదే ప్రాంగణంలో రూ.1.90కోట్ల వ్యయంతో హైటెన్షన్ విద్యుత్ తీగలకు ప్రత్యేక స్తంభాలు వేసి 33/11 సామర్థ్యం గల విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించారు.

శరవేగంగా షాపింగ్ కాంప్లెక్స్ పనులు



రామగుండం: రామగుండం రైల్వే స్టేషన్ ఎదుట మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సోమవారం స్లాబ్ వేసే పనులు చేపట్టగా.. మున్సిపల్ ఇంజనీర్లు పర్యవేక్షించారు. రైల్వే స్టేషన్ ఎదుట సుందరీకరణ చేసేందుకు ముందుగా చిరు వ్యాపారుల టేలాలను తొలగించి వారికి శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులను కేటాయించనున్నారు. ఆ తర్వాత స్టేషన్ ఎదుట వాటర్ ఫౌంటెన్ తోపాటు గార్డెన్ ఇతరత్రా సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్ తెలిపారు.

ప్రశంసాపత్రాలు అందజేత



ఎలిగేడు: విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత



రామగుండం: విజేతకు ధ్రువపత్రాల అందజేత

ఎలిగేడు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సోమవారం మండలస్థాయి బయాలజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఎలిగేడు, ధూళికట్ట, సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఎలిగేడు పాఠశాలకు చెందిన కోడూరి సాహిత్య ప్రథమస్థానం, సుల్తాన్‌పూర్ పాఠశాలకు చెందిన బి.నిఖిల్ ద్వితీయ స్థానంలో నిలిచారు. జిల్లాస్థాయిలో జరిగే టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గంగ్ర దేవేందర్‌రావు తెలిపారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు అరుణకుమారి, కేవీఎస్ మూర్తి, డి.చంద్రశేఖర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయికి ఎంపిక

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఆదర్శ స్కూల్ విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో మండలస్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సదానందం తెలిపారు. పదోతరగతి చదువుతున్న జి.అనుదీప్, నిదా తస్నీమ్ మండలస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారని, వీరు త్వరలోనే జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు హాజరు కానున్నట్లు తెలిపారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం బయాలజికల్(టీబీఎస్‌ఎఫ్) టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కమాన్‌పూర్, రొంపికుంట, జూలపల్లి జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈవో మాట్లాడుతూ.. ఈ పరీక్షలతో విద్యార్థులు నూతన ఆవిష్కరణలను తయారు చేసుకోవచ్చని అన్నారు. శంకర్, మల్లేశ్, సరళ తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం: ముత్తారం ఎంఆర్‌సీ కార్యాలయంలో సోమవారం మండలస్థాయి జీవశాస్త్రం టాలెంట్ టెస్ట్‌లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు సహస్ర 45 మార్కులతో ప్రథమ స్థానంలో, సాయికీర్తన 35 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు.

తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం



తెలంగాణ తల్లి విగ్రహానికి నమస్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



జూలపల్లిలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నామని ప్రకటించిన డిసెంబర్ 9ని పురస్కరించుకొని అయ్యప్ప గుడి కూడలి వద్ద సోమవారం మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు పూదరి చంద్రశేఖర్, నాంసాన సరేశ్‌బాబు, రేవల్లి స్వామి, కనుకుర్తి కార్తీక్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రామగిరి చంద్రమౌళి, ఫహీమ్, నాయకులు సయ్యద్ మొబినొద్దీన్, పెంచాల శ్రీధర్, జావిద్, కుక్క మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండె చప్పుడు

జూలపల్లి: కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం ఎవరి తరం కాదని, కేసీఆర్ అంటేనే తెలంగాణ ప్రజల గుండె చప్పుడని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు రఘువీర్‌సింగ్ అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో నల్ల కండువాలు ధరించి తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మాజీ ఎంపీపీ విసారపు వెంకటేశం, బండి రాజయ్య, లక్కాకుల శ్రీనివాస్, రేచవేని మల్లేశం, ఆరెల్లి శ్రీనివాస్, మేర శ్రీనివాస్, సంకెన్ల లక్ష్మీనర్సయ్య, సతీశ్, కొండపల్లి కృష్ణమూర్తి తదితరులున్నారు.

'ఆయాకు న్యాయం చేయాలి'



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని విఠల్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తున్న జగదీశ్వరికి న్యాయం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ కాంట్రాక్ట్ సంఘం గౌరవ అధ్యక్షుడు ఎంఏ గౌస్, డీహెచ్పీఎస్ జిల్లా కన్వీనర్ మద్దెల దినేశ్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జగదీశ్వరి 12 సంవత్సరాలుగా విఠల్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తోందని, ఆ కేంద్రంలో పని చేసే టీచర్ బదిలీ కాగా తన స్థానంలో అర్హత ఉన్న జగదీశ్వరిని ప్రమోట్ చేయక మార్కండేయకాలనీ అంగన్వాడీ కేంద్రంలోని హెల్పర్‌కు అవకాశమిచ్చారన్నారు.

ముత్తారం: మండలంలో ఇంటి అవసరాల నిమిత్తం మానేరు ఇసుక కోసం అనుమతివ్వాలని కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేసినట్లు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తెలిపారు.

నేడు విద్యుత్ ప్రజావాణి

ధర్మారం/జూలపల్లి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో ఈనెల 10న విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేసినట్లు వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాలాచారి తెలిపారు. వినియోగదారుల విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, వోల్టేజీ సమస్యలు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల తదితర సమస్యలపై ఫిర్యాదులు అందించొచ్చన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కాల్వశ్రీరాంపూర్: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాల్వశ్రీరాంపూర్ ఎంఈవోకు యూనియన్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో సర్కార్ నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని, అందుకే ఈనెల 10న నిరవధిక సమ్మెకు పూనుకుంటున్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన నిరవధిక సమ్మెలో యనియన్ సంపూర్ణంగా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్వామి, దేవదాస్, దుర్గాప్రసాద్, చందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష



సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్ వద్ద ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వాములకు భిక్షను రిటైర్డ్ డీసీపీ సాగి సుధాకర్‌రావు ఏర్పాటు చేసి వడ్డించారు. సోమవారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన స్వాములకు భిక్షతోపాటు తమలపాకులు, అరటిపండు అందజేశారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా రాజిరెడ్డి



సుల్తానాబాద్‌రూరల్: నారాయణరావుపల్లి గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ నామని రాజిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం రెడ్డి సంఘ సమావేశం నిర్వహించగా.. నూతన అధ్యక్షున్ని ఎన్నుకున్నారు. రాజిరెడ్డి మాట్లాడుతూ.. సంఘ అభివృద్ధికి పలు తీర్మానాలు చేసుకున్నట్లు తెలిపారు. రెడ్డి సంఘ సభ్యులున్నారు.

ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

గోదావరిఖని: డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం నిర్వహించారు. 634 మందికి డబుల్ బెడ్‌రూంలు కేటాయించిన సందర్భంగా స్థానిక ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంచి పెట్టారు.

సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

సుల్తానాబాద్: గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో దివ్యదర్శన్ రావును కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. కంకణాల రాజేశ్‌కుమార్, రమేశ్, రణధీర్, మంగారెడ్డి, రాధ, అనిత, మౌనిక, ఆసియా, హేమలత తదితరులున్నారు.

రహదారి మరమ్మతు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: వెన్నంపల్లి గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీలు పంట పొలాలకు వెళ్లేందుకు రహదారి మరమ్మతు పనులను సోమవారం మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.



గోదావరిఖని: కేక్ కట్ చేస్తున్న నాయకులు



పెద్దపల్లిరూరల్: జెండా కూడలి వద్ద కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



గోదావరిఖనిటౌన్: కేక్ కట్ చేస్తున్న లీగల్ సెల్ నాయకులు

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

కోట్లాది ప్రజల ఆకాంక్ష అయిన తెలంగాణ రాష్ట్రాన్ని అందించిన గొప్ప నాయకురాలు సోనియాగాంధీ అని పలువురు కొనియాడారు. సోమవారం జిల్లాలో ఆమె జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. తెలంగాణ సాధన కోసం జరుగుతున్న పోరాటంలో అనేక మంది త్యాగాలు, ప్రాణ త్యాగాలు గమనించి చలించిపోయి తెలంగాణ రాష్ట్రం ఇస్తానని ప్రకటించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని అన్నారు. ప్రధాన మంత్రిగా చేసే అవకాశమున్నా త్యాగం చేసి మన్మోహన్‌సింగ్‌కు కట్టబెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమిచ్చిన హామీలను అమలు చేసిందని అన్నారు. కాంగ్రెస్, దాని అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ హనుమాన్‌నగర్ ఏరియాలో సీసీ రోడ్డుకు ఇరువైపులా మట్టి కుప్పలు ఉండడంతో స్థానిక ప్రజలతోపాటు స్కూల్ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో సీసీ రోడ్డు మధ్యలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రోడ్డు తవ్వి డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తి చేశారు. కానీ తిరిగి రోడ్డును నిర్మించలేదు. నెల క్రితం రోడ్డు మరమ్మతు పేరుతో రోడ్డు మధ్యలోని మట్టిని తొలగించి తాత్కాలికంగా సిమెంట్ కంకరతో గుంతలు పూడ్చారు. కానీ తీసిన మట్టిని ఏరియా వాసుల ఇళ్ల ఎదుట రోడ్డుకు ఇరువైపులా అలాగే ఉంచారు. దీంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మట్టి రోడ్డుపైకి వచ్చి బురదగా మారుతోందని వాపోయారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు మట్టి కుప్పలను తొలగించాలని ఏరియా వాసులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



జూలపల్లి: పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచులు

జూలపల్లి: పెండింగ్ బిల్లులను సాధించుకునేందుకు మాజీ సర్పంచుల సంఘం ఇచ్చిన చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా జూలపల్లి ఠాణా పోలీసులు జూలపల్లి, ఎలిగేడు మండలాల్లోని మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేసి ఠాణాలో ఉంచారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. తానిపర్తి మోహన్‌రావు, కొండాల్‌రెడ్డి, కుమార్, జ్యోతిబసు, రాజచర్ల కొండయ్య, ఈర్ల మల్లేశం, పాలవేని వీరయ్య, కుంటూరి రాజయ్య తదితరులున్నారు.

కాల్వశ్రీరాంపూర్: పెండింగ్ బిల్లుల చెల్లింపు కోసం అసెంబ్లీ ముట్టడి పిలుపు మేరకు హైదరాబాద్ వెళ్తున్న మాజీ సర్పంచులను సోమవారం కాల్వశ్రీరాంపూర్ పోలీసులు అరెస్టు చేశారు. మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాసర్ల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. నిర్బంధం మాని నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రామగుండం: మాజీ సర్పంచులను వేకువజామున అంతర్గాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న ప్రమీల

జ్యోతినగర్: ప్రతిష్టాత్మకమైన సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డును ఉపాధ్యాయురాలు దుర్గం ప్రమీల అందుకున్నారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ అన్నపూర్ణకాలనీకి చెందిన సమత ఫౌండేషన్ నిర్వాహకురాలు, ఉపాధ్యాయురాలు దుర్గం ప్రమీల సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డు-2024ను అందుకున్నారు. న్యూఢిల్లీలోని పంచశీల ఆశ్రమంలో భారతీయ దళిత సాహిత్య అకాడమీ 40వ రాష్ట్రీయ రైటర్స్ కాన్ఫరెన్స్‌లో జాతీయ అధ్యక్షుడు ఎస్పీ సుమనాక్షర్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్ చేతుల మీదుగా ప్రమీల ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

అవార్డు అందుకున్న విశ్వనాథ్

యైటింక్లయిన్‌కాలనీ: భారతీయ దళిత సాహిత్య అకాడమీ వారి మహాత్మా జ్యోతిబాపూలే 2024కు గాను కాలనీకి చెందిన సమతా ఫౌండేషన్ సభ్యుడు దుర్గం విశ్వనాథ్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు అందుకున్నారు. సోమవారం న్యూఢిల్లీలో పంచశీల ఆశ్రమంలో నిర్వహించిన 40వ భారతీయ దళిత రైటర్స్ కాన్ఫరెన్స్ సమ్మేళన కార్యక్రమంలో భారతీయ సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు సుమనాక్షర్, రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్ మను చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

కోల్‌సిటీ: గోదావరిఖని ద్వారకానగర్‌లో సోమవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్యశిబిరాన్ని డివిజన్ కార్పొరేటర్ కొమ్ము వేణు ప్రారంభించారు. సింగరేణి ఉద్యోగుల కుటుంబాలు, రిటైర్డ్ ఉద్యోగులకు గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ తదితర సూపర్ స్పెషాలిటీ వైద్య పరీక్షలను ఆసుపత్రి డాక్టర్ దీక్షిత్ నిర్వహించారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

సుల్తానాబాద్: విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని గర్రెపల్లి పీహెచ్‌సీ హెచ్‌ఈవో ఖాజా అనుసోద్దీన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పుసాల, ప్రభుత్వ ఎస్సీ, బీసీ హాస్టల్‌లో పరిశుభ్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, వార్డెన్ ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గోదావరిఖని: స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కోలిండియా కబడ్డీ జట్టుకు శిక్షణ

గోదావరిఖని: కోలిండియా పోటీలకు ఎంపికైన సింగరేణి జట్టుకు సోమవారం ప్రత్యేక శిక్షణ ప్రారంభించారు. వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, అధికారులు కిరణ్‌బాబు, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో తీర్మానించాలి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సొంతింటి పథకం కోసం అసెంబ్లీలో తీర్మానించాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోరారు. సోమవారం ఇక్కడ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్ తిరిగి చెల్లించాలని, మారుపేర్ల సమస్య పరిష్కరించాలని కోరారు. రాజమౌళి, శ్రీనివాస్, నరహరిరావు పాల్గొన్నారు.

భాగస్వాములు కండి

మంథని: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 11న మంథని మున్సిపల్, మండలస్థాయిలో స్థానిక ప్రభుత్వ క్రీడా మైదానంలో నిర్వహించే సీఎం కప్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రమ, కమిషనర్ మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో పూర్ణచందర్ కోరారు.